క్లుప్తంగా

ఉచిత వైద్యసేవలు



గుడివాడటౌన్: రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. చినఅవుటపల్లికి చెందిన పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల వైద్య బృందం.. గుండె, నరాలు, ఎముకల వ్యాధులతోపాటు జనరల్ వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 85 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెడికల్ క్యాంప్ కన్వీనర్ సి. సూర్యచంద్రరావు, జి. కిరణ్ బాబు, రోటరీక్లబ్ అధ్యక్షుడు రమణమూర్తి, డాక్టర్లు ఎంవీ మాధవ్, పి.దివ్య సాయిరామ్, వంశీకృష్ణ, బి.అజిత, కె. రూపాతేజస్వి తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రి పద్మకు రావూరి పురస్కారం



గుడివాడటౌన్: మహిళా సంక్షేమానికి కృషి చేస్తున్న వ్యక్తులను గుర్తించి సత్కరించడం వారి సేవలకు నిదర్శనమని గాయత్రి మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు సీహెచ్ ఉమాదేవి అన్నారు. స్థానిక శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామివారి దేవస్థాన ప్రాంగణంలో ఆదివారం తెలుగు బాషా వికాస సమితి ఆధ్వర్యాన అవనిగడ్డకు చెందిన ప్రముఖ రచయిత్రి సింహాద్రి పద్మను రావూరి భరద్వాజ్ పురస్కారంతో సత్కరించారు. జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజ్ 97వ జయంతి వేడుకలు పురస్కరించుకుని ఈ అవార్డు ప్రదానం చేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో భవిరి శంకర్‌నాథ్ వసుధ బసవేశ్వరరావు, ఎం.మాధవరావు, జి.మోహన్‌బాబు, డాక్టర్ ప్రియాంక, డీఆర్‌బీ ప్రసాదు, జి.మాల్యాద్రి, పి. శ్రీనుబాబు, కె. లీలా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఈస్ట్ ఫీల్డ్ కౌన్సిల్ సభ్యులకు సన్మానం



జమీగొల్వేపల్లి(పామర్రు): ఉయ్యూరు ఈస్ట్ ఫీల్డ్ కౌన్సిల్‌కు ఎంపికైన నూతన సభ్యులను మండల పరిధి జమీగొల్వేపల్లి సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ చర్చిలో ఆదివారం ఘనంగా సన్మానించారు. కొత్తగా ఎంపికైన ఈస్ట్ ఫీల్డ్ అధ్యక్షులుగా రెవ. కె.ఏసుదాసును, ఎం.దావీద్(చినబాబు), సీహెచ్ రూ తు మేరీలను సభ్యులుగా ఎంపిక చేశారు. వీరికి శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో పలు చర్చిల పాస్టర్లు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం



గుడివాడ టౌన్: రోటరీక్లబ్ ఆఫ్ గుడివాడ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం ఘనంగా జరిగింది. స్థానిక రాజేంద్రనగర్‌లోని జీవీ పూర్ణచంద్రరావు కమ్యూనిటీ హాల్లో రోటరీక్లబ్ కౌన్సిల్ సభ్యుడు జి. బాబూ శ్రీకర్ నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. 2024 -25 సేవా సంవత్సరం నూతన అధ్యక్షుడిగా టీఎస్ రాజశేఖర్, కార్యదర్శిగా జి. కిరణ్‌బాబు, కోశాధికారిగా నరహరశెట్టి ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ కార్యదర్శిగా జి.నరేష్, ఉపాధ్యక్షుడు వై. సుహాస్ ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కార్యవర్గం మరిన్ని సేవలు చేయాలని కౌన్సిల్ సభ్యులు బాబూ శ్రీకర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ ఎ.జ్యోతి, పూర్వ అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



పమిడిముక్కల: మండలంలోని కపిలేశ్వరపురంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, మందా కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ పతాకాన్ని విశ్రాంత ఉపాధ్యాయులు కొడాలి కోటేశ్వరరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ మండల కన్వీనర్ వేల్పూరి మధు, బుల్లా శేఖర్, పచ్చిగళ్ల సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరుపై చెరగని ముద్ర



గుడ్లవల్లేరులో బ్రిడ్జి భూమి పూజకు వైఎస్సార్‌ను పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న వేద పండితులు(ఫైల్)



గుడ్లవల్లేరుకు తలమానికమైన వైఎస్సార్ బ్రిడ్జి

వైఎస్సార్ పాదస్పర్శతో మహర్దశ

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు అభివృద్ధి అంశంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చెరగని ముద్ర వేశారు. ఆయన గుడ్లవల్లేరులో అడుగు పెట్టడంతో మండల ప్రజలు ఊహించని అభివృద్ధి జరిగింది. దీంతో జన హృదయ నేతను ఈనాటికీ అక్కడి ప్రజలు తలచుకుంటూనే ఉన్నారు. వైఎస్సార్ తన హయాంలో 2008లో రూ.14 కోట్ల ప్రభుత్వ నిధులతో గుడ్లవల్లేరు ప్రాంతానికే తలమానికమైన వైఎస్సార్ బ్రిడ్జిని నిర్మించారు. ఈ 'వై' ఆకారపు వంతెన..ఎంఎన్‌కే రహదారికేకాకుండా భీమవరం–మచిలీపట్నం ప్రధాన రహదారిలో రాకపోకలకు ఎంతో దోహదపడుతుంది. రూ. 51లక్షలతో మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాలు నిర్మించారు. వీటి ప్రారంభోత్సవానికి వచ్చిన ఆ మహానేత బ్రిడ్జికి శంకుస్థాపన చేశారు. అక్కడకు వచ్చిన మహానేత ఈ ప్రాంతంలో అస్తవ్యస్తంగా ఉన్న రహదారులను చూసి చలించిపోయారు. ఆ రోడ్లను సీసీ రోడ్లగా నిర్మించేందుకు రూ.40 లక్షలను సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి కేటాయిస్తూ.. బ్రిడ్జి ప్రారంభం అనంతరం బహిరంగ సభా వేదికపైనే సంతకం చేసిన ఘనత ఆయనది. గ్రామంలో మంచినీటి పథకానికి దాదాపు రూ.25 లక్షల నిధులను వైఎస్ ప్రభుత్వం కేటాయించింది.

సమస్య పరిష్కారమే వైఎస్సార్ బాట



ప్రజలు ఎదుర్కొంటున్న ఏదైనా సమస్య వైఎస్సార్ దృష్టికి వచ్చినా దాని పరిష్కారమే బాటగా వ్యవహరిస్తారు. మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల ప్రారంభానికి ఆయన వచ్చినపుడు కాంగ్రెస్ పార్టీలో ఎంపీపీగా ఉన్నాను. ఆయన దృష్టికి మండలంలో వచ్చిన ప్రతి సమస్యను విని వెంటనే పరిష్కరించారు. అందులో భాగమే ఈ అభివృద్ధి.

– పడమటి నాంచారయ్య, కౌతవరం(గుడ్లవల్లేరు మండలం)

వైఎస్ అడుగు పెట్టడంతోనే అభివృద్ధి



గుడ్లవల్లేరులో వైఎస్సార్ అడుగు పెట్టారు. అంతే కోట్లాది రూపాయల వంతెన వచ్చింది. రోడ్ల నిర్మాణాలకు నిధులు వచ్చాయి. మంచినీటి పథకానికి కావలసిన నిధులన్నీ సమకూరాయి. ఆ మహానేతను మా గ్రామస్తులంతా ఎన్నడూ మరువలేరు. అభివృద్ధిపై ఆయన చూపించిన చొరవ ఈనాటికీ మరువలేనిది. ఆయన రెండుసార్లు వచ్చారు. గుడ్లవల్లేరు రూపురేఖలే మారిపోయాయి.

– అడపా గోపాలకృష్ణ, వడ్లమన్నాడు(గుడ్లవల్లేరు మండలం)

అభాగ్యుల ధైర్యం.. వైఎస్సార్

కైకలూరుపై రాజన్న ప్రత్యేక శ్రద్ధ



కైకలూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రసంగిస్తున్న మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి(ఫైల్)

కైకలూరు: ఆయన చిరునవ్వు... అభాగ్యులకు ఓ ధైర్యం. ఆరోగ్య శ్రీ పథకంలో ప్రాణాలు నిలబెట్టుకున్న ప్రతి గుండెలో ఆయన బతికే ఉంటారు. రాజన్నా.. నీవు భౌతికంగా దూరమైనా.. బంధువై మా వెంటే ఉన్నావని మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని ప్రజలు తలుచుకుంటున్నారు.

కొల్లేరు ప్రజలకు ప్రత్యేక ప్యాకేజీ

నాడు కొల్లేరు ఆపరేషన్‌ను సుప్రీంకోర్టు ఆదేశాలతో తప్పనిసరి పరిస్థితుల్లో చేయాల్సి వచ్చింది. ఆపరేషన్‌లో చెరువులు కోల్పోయిన కొల్లేరు గ్రామాల ప్రజలకు రూ.3,500 కోట్లు ప్రత్యేక పునరావాస ప్యాకేజీని నాటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కేటాయించారు. కొల్లేరులో సంప్రదాయ వేట సాగించొచ్చని చెప్పారు. కైకలూరు యానాదుల కాలనీలో పేదల స్థలాల పంపిణీలో సాంకేతిక సమస్య వచ్చింది. అప్పటి ఎమ్మెల్యే రాజబాబు విషయాన్ని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఏకంగా అసెంబ్లీలో తీర్మానం చేసి భూముల పంపిణీకి అవకాశం కల్పించారు. కైకలూరు పంచాయతీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించారు. ఈ విధంగా కైకలూరు ప్రాంతంపై ఆయన ప్రత్యేక అభిమానాన్ని చూపించారు.

కైకలూరు సంతమార్కెట్‌లో 23 అడుగుల మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద సోమవారం ఉదయం 8 గంటలకు మహానేత వైఎస్ రాజేశేఖర్‌రెడ్డిని జయంతిని మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు.

నేడు వైఎస్ జయంతి వేడుకలు

పామర్రు: పామర్రులోని మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 8గంటలకు డాక్టర్ వైఎస్సార్ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు కార్యాలయ సిబ్బంది ఆదివారం తెలిపారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం కూడలి వద్ద, చిన్న పాల కేంద్రం వద్ద , యలమర్రు రోడ్డులో, పామర్రు మార్కెట్‌యార్డులో ఉన్న వైఎస్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తారని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

కొండలమ్మకు పొంగళ్ల సమర్పణ



గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మను దర్శించుకుని మొక్కుబడులను చెల్లించుకునేందుకు ఆలయంలో క్యూలైనుల్లో భక్తులు ఆదివారం అధికసంఖ్యలో బారులు తీరారు. అమ్మవారికి మహిళా భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్ ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లలో వచ్చే భక్తులకు మజ్జిగను అందించారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



తాడంకిలో ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాకు పూర్ణ కుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

పమిడిముక్కల: నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. మండలంలోని తాడంకి గ్రామంలో ఆదివారం కూటమి విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. తొలిసారిగా గ్రామంలోకి వచ్చిన ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. చెన్నకేశవస్వామి ఆలయంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే రాజా.. స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు జక్కా శ్రీనివాసరావు, నాదెళ్ల సుబ్రమణ్యం, జక్కా గోవర్ధనరావు, టీవీఎల్ పురుషోత్తం, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా లేకుంటే ముప్పే

- వర్షాకాలంలో పశువులు జరభద్రం
- సీజనల్ వ్యాధులు సోకే అవకాశం
- వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి



గ్రామంలోని పాడి పశువులు

పామర్రు: అప్రమత్తంగా లేకుంటే పశువులకు ముప్పుగా మారొచ్చు. వర్షాకాలంలో జీవాలకు వ్యాధులు సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వీటిపై రైతులు అప్రమత్తంగా లేకుంటే తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని పశువైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం అన్ని రకాల వ్యాధుల నివారణకు ఉచితంగా టీకాలు వేయిస్తోంది. రైతు భరోసా కేంద్రాల వద్ద పశువైద్య సేవలను అందిస్తూ వారికి అవగాహన కలిగిస్తోంది.

పశువులకు సోకే వ్యాధులు

పశువులకు వచ్చే వ్యాధులు నాలుగు రకాలుగా వర్గీకరించారు. అవి అంటువ్యాధులు, జీర్ణప్రక్రియ లోపాలు, గర్భకోశ వ్యాధులు, సాధారణ వ్యాధులుగా ఉంటాయి.

- **అంటువ్యాధులు:** బ్యాక్టీరియల్, వైరల్, ఫంగస్, ప్రియాస్ ద్వారా వచ్చే వ్యాధులు, పరాన్న జీవుల ద్వారా వచ్చే వ్యాధులు, క్యూఫీవర్ తదితరాలు
- **బ్యాక్టీరియల్:** గొంతువాపు, జబ్బవాపు, రొమ్ము రోగం, బ్రూసెల్లోసిస్, బొవైను టీబీ, లెప్టోస్పై రోసిస్, ధనుర్వాతం, ఫుట్‌రాట్, చిటుకవ్యాధి
- **వైరల్:** మూసర వ్యాధి, గాలికుంటు వ్యాధి, ఎఫిమిరల్ జ్వరం, మశూచి, నీలి నాలుక వ్యాధి, ఐబీఆర్(ఇన్‌ఫెక్టియస్ బొవైన్ రైనో ట్రైనైటిస్) తదితర వ్యాధులు

జీర్ణప్రక్రియ లోపాలతో వచ్చే వ్యాధులు, కీటోసిస్, పాలజ్వరం, పడక జబ్బు, ఎసిడోసిస్, అల్కలోసిస్, బ్లోట్ జబ్బు, పారుడు జబ్బు

- **గర్భకోశ వ్యాధులు:** గర్భవాతం, పయోమెట్ర, సెర్విసైటీస్, తిరిగిపొర్లడం, అనిష్టం వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.

నియోజకవర్గంలో పశుగణన

	గేదెలు	ఆవులు	గొర్రెలు	మేకలు	మొత్తం
పామర్రు	1350	300	2350	1250	5,250
తోట్లవల్లూరు	1051	200	1550	1225	4,026
పమిడిముక్కల	1375	225	2500	1210	5,310
మొవ్వ	1650	350	2600	1290	5,890
పెదపారుపూడి	1150	210	2050	1200	4,610
					25,086

నివారణ చర్యలు

పశువులకు వచ్చే వ్యాధులను గుర్తించి సంబంధిత సచివాలయంలోని వెటర్నరీ అసిస్టెంట్‌ను కలిసి వైద్యం అందించాలి. మెరుగైన వైద్యానికి పశువైద్యాధికారిని సంప్రదించాలి.

వైద్యుల సూచనలను తప్పక పాటించాలి

సీజనల్ వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉంటూ పశువైద్యుల సలహాలు, సూచనలను పాటించాలి. ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో ఉన్న వెటర్నరీ అసిస్టెంట్‌ల వద్దకు పశువులను తీసుకువెళ్లి వ్యాధి గురించి తెలియజేస్తే వైద్య సేవలు అందిస్తారు. వారి పరిధిలో వ్యాధిని నయం చేయలేని పరిస్థితి ఉంటే రైతులు సంబంధిత పశువైద్యాధికారిని సంప్రదిస్తే అవసరమైన వైద్యం అందిస్తారు.

–సునీల్‌కుమార్, మండల పశువైద్యాధికారి

తీసుకోవాల్సిన జాగ్రత్తలివీ..

- పశువుల శాలల్లో గాలి, వెలుతురు బాగా వచ్చేలా చర్యలు తీసుకోవాలి
- పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి
- పరిశుభ్రమైన నీటిని పశువులకు అందించాలి
- పచ్చిమేతతో పాటు ఎండు గడ్డి కూడా పెట్టాలి
- వ్యాధి నిరోధక టీకాలను ఎప్పటికప్పుడు వేయిస్తుండాలి
- ఈగలు, దోమలు పూర్తిగా నిర్మూలించే చర్యలు తీసుకోవాలి
- ఎరాన్న జీవుల నివారణకు చర్యలు చేపట్టాలి.

ఆరేపల్లికి మాజీ ఎమ్మెల్యే కైలే పరామర్శ



ఆరేపల్లి కుటుంబసభ్యులతో కైలే అనిల్‌కుమార్

తోట్లవల్లూరు: చినపులిపాక మాజీ సర్పంచ్ ఆరేపల్లి జగన్‌మోహన్‌రావును పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆదివారం పరామర్శించారు. జగన్ మోహన్‌రావు తల్లి ఆరేపల్లి ముత్యాలమ్మ ఇటీవల మృతి చెందారు. ఆమె దశ దిన కర్మ నేపథ్యంలో జగన్‌మోహన్‌రావు కుటుంబసభ్యులను కైలే అనిల్ కుమార్ పరామర్శించి, ధైర్యంగా ఉండాలని సూచించారు. తోట్లవల్లూరు, కంకిపాడు జెడ్పీటీసీ సభ్యులు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, బాకీబాబు, మండల పార్టీ అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ ఆరేపల్లి రాము, మాజీ జెడ్పీటీసీ మోర్ల రామచంద్రరావు, వైస్ ఎంపీపీ మెల్లంపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

పామర్రు: టౌన్‌లోని చాట్లవానిపురానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు చాట్ల పెదమస్తాన్‌రావు ఇటీవల కాలంలో అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆదివారం పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు కాకర్ల వెంకటేశ్వరరావు, బొమ్మారెడ్డి అప్పిరెడ్డి తదితరులు మృతుని కుటుంబాన్ని పరామర్శించిన వారిలో ఉన్నారు.

వైభవంగా జగన్నాథుని రథయాత్ర



స్వామి వారి మూల విరాట్‌ను రథం పైకి చేరుస్తున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: రెండో పూరీగా ప్రసిద్ధి చెందిన మండలంలోని వడాలి శ్రీ జగన్నాథస్వామి ఆలయంలో శ్రీ సుభద్ర బలరామ సమేత జగన్నాథుడి రథయాత్ర ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆషాఢమాసం విదియ సందర్భంగా ఏటా పూరీలో జగన్నాథుడి రథయాత్ర నిర్వహిస్తారు. వడాలి స్వామివారి ఆలయం తరఫున ఇదే రోజున రథయాత్ర నిర్వహిస్తారు. సుభద్ర బలరామ సమేత జగన్నాథుడి విగ్రహాలు పూరీలో దారు(చెక్క)తో చేయబడిన మూల విరాట్‌తో రథయాత్ర నిర్వహిస్తారు. వడాలి ఆలయంలో సైతం మూల విరాట్ దారు(చెక్క)తో చేసి ఉండడం విశేషం. ఈ కారణంతో ఇక్కడ మూల విరాట్‌తో రథయాత్ర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. రథయాత్ర ముదినేపల్లి సెంటర్, శ్రీహరిపురం మీదుగా సింగరాయపాలెం బావాజీ మఠం వరకు నిర్వహించి అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షించగా మాజీ ఎంపీపీ వీరమల్లు నరసింహారావు, ఎన్డీఏ కూటమి నేతలు పలువురు పాల్గొన్నారు.

రైలు నుంచి పడి యువకుడికి గాయాలు



తీవ్రంగా గాయపడిన గోపాలకృష్ణను అంబులెన్సు వద్దకు తీసుకువస్తున్న సిబ్బంది

పెడన: గుడివాడ నుంచి మచిలీపట్నం వస్తున్న ప్యాసింజర్ రైలు నుంచి ఒక యువకుడు ప్రమాదవశాత్తు జారిపడి తీవ్ర గాయాలకు గురైన సంఘటన పెడన పట్టణంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుడివాడ రైల్ పేటకు చెందిన సాయిన గోపాలకృష్ణ (20) మచిలీపట్నం వచ్చేందుకు గుడివాడలో రైలు ఎక్కాడు. ఆదివారం సాయంత్రం ఐదు గంటల సమయంలో ప్యాసింజర్ రైలు పెడన రైల్వే స్టేషన్‌లోకి వస్తున్న సమయంలో జారి పడ్డాడు. రైలు కింద ఎడమ కాలు పూర్తిగా తెగిపోగా కుడి కాలు బాగా దెబ్బతింది. స్థానికుల సమాచారంతో అంబులెన్స్ సిబ్బంది మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గోపాలకృష్ణకు రెండు కాళ్లు తీసేసి చికిత్స అందిస్తున్నారు. రైల్వే హెచ్‌సీ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు.

పైడమ్మ అమ్మవారికి ఆషాఢ సారె

పెడన: పట్టణంలో ప్రసిద్ధిగాంచిన గ్రామ దేవత పైడమ్మ తల్లికి ఆదివారం ఆషాఢ సారె సమర్పించారు. గ్రామ దేవత అత్తింటివారు దాసు వంశీయులు ఒకటో వార్డులోని పైడమ్మ అమ్మవారి దేవస్థానానికి మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆషాఢ సారెను అందజేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఆలయ కమిటీ, దేవదాయశాఖ సిబ్బంది పర్యవేక్షించారు.

మల్లంపల్లి(ఘంటసాల): మండలంలోని మల్లంపల్లి గ్రామంలో ఆషాఢ మాసం సందర్భంగా రెండో రోజైన ఆదివారం అమ్మవార్లకు గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆషాఢ సారె సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలోని శ్రీ పర్వతవర్ధినీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో పర్వత వర్ధిని అమ్మవారికి, గంగానమ్మ మందిరంలోని గంగానమ్మకు పసుపు, కుంకుమ, పూలు, గాజులు, చీరలు, వివిధ రకాల పండ్లతో కూడిన సారెను ఊరేగింపుగా తీసుకొని వచ్చి, ఆయా దేవాలయాల్లోని అర్చకులకు అందజేశారు.

అన్న ప్రసాదాలయం ఏర్పాటు



అన్న ప్రసాదాలయం నిర్మించారు.

మండవల్లి: మండవల్లి షిర్డీ సాయిబాబా మందిరంలో నిర్వాహకులు గుడివాడ చిట్టిబాబు అన్న ప్రసాదాలయం ఏర్పాటు చేశారు. ఈ ఆలయంలో ప్రతి గురువారం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తారు. పలు పర్యాయాలు దాతల వితరణతో సమారాధన నిర్వహిస్తారు. కొన్నిసార్లు ఆలయ నిర్వాహకులే అన్న సమారాధన చేస్తారు. సమారాధనకు వచ్చే భక్తులకు వసతి సదుపాయాలు లేక ఆలయ ప్రాంగణంలోనే నిలబడి అన్న ప్రసాదం తీసుకునేవారు. ఈ నేపథ్యంలో, భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాదాలయం నిర్మించారు.

సుబ్బారాయుడి సన్నిధిలో భక్తుల సందడి

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో భక్తజన సందడి అధికంగా కనిపించింది జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఆదివారం ఉదయాన్నే ఆలయానికి చేరుకోవడంతో ఆ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. స్వామి వారి పుట్టలో పాలు పోసేందుకు, పాల పొంగళ్ల శాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారు చేసేందుకు అధిక సమయం వేచి ఉండాల్సి వచ్చింది. స్వామిని దర్శించుకున్న అనంతరం నాగ బంధాల వద్ద పూజలు చేశారు. గోకులంలోని గోవులకు మహిళలు పసుపు కుంకుమలతో పూజలు చేశారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ సహాయ కమిషనర్ నేల సంధ్య, సిబ్బంది పర్యవేక్షించారు.

మార్మోగిన పెద్దింట్లమ్మ నామస్మరణ

కైకలూరు: కొల్లేటికోట అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలో పెద్దింట్లమ్మ నామస్మరణ ఆదివారం మార్మోగింది. ఏలూరు, పశ్చిమ, తూర్పు గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకొని, నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారి దేవస్థానం వద్ద కుటుంబ మొక్కుల కార్యక్రమాలకు ఆయా నియోజకవర్గ నాయకుల ప్రత్యేక ఆహ్వానం మేరకు ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ విచ్చేశారు. కార్యక్రమంలో ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు తనయుడు భరత్, జనసేన నాయకులు కొల్లి బాబి, జుత్తిగ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలకు పాల్పడితే చర్యలు

గుడివాడటౌన్: గుడివాడ పట్టణ పరిసర ప్రాంతాల్లో మట్టి అక్రమ తవ్వకాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని గుడివాడ తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు హెచ్చరించారు. పట్టణానికి చెందిన ఓ ప్రైవేట్ కళాశాలకు మట్టిని సరఫరా చేస్తున్న జేసీబీ, ట్రాక్టర్లను రెవెన్యూ సిబ్బందితో కలిసి స్వాధీనపర్చుకున్నారు. అనుమతి లేని మట్టి తవ్వకాలు చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు.